నేడు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ భవనం ప్రారంభం



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. కిస్మత్‌పూర్‌లో సుమారు రెండు ఎకరాల స్థలంలో అధునాతన పద్ధతిలో 12.65 కోట్ల రూపాయలను వెచ్చించి కార్యాలయాన్ని నిర్మించారన్నారు. గురువారం ఉదయం కార్యాలయ భవనాన్ని మంత్రి శ్రీధర్ బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎ.మల్లేష్ రాజ్ లిపారు. డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్.వి.నిర్మన్, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్‌కీ విల్లా, కుదర్ ఎస్ఆర్ఐ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: పాల్మాకుల వద్ద నిర్మించిన జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం నూతన భవనాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. కార్యాలయంతో పాటు దుకాణ సముదాయాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. రైతులకు అందుబాటులో ఉండేలా ఇక్కడ భవనాన్ని నిర్మించడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు సొసైటీల ద్వారా పొందే రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30 రోజుల శిక్షణను ఈ నెల 7 నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ట్రస్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు



గురుకులాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మణికొండ: నార్సింగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శోభ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పూనమ్, పీహెచ్సీ వైద్యాధికారి సత్యరత్న సందర్శించారు. ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా వంటగది, భోజన శాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ సుజాత, హెల్త్ ఎక్స్‌టెన్షనల్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎంఎం తేజ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వికాస్‌సింగ్

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కాటేదాన్ బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన వికాస్‌సింగ్(25) జనవరి 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి విస్తరణకు గ్రహణం

మూడేళ్లుగా కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

- గుంతలమయమైన రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు

శంషాబాద్ రూరల్: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి విస్తరణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా గుంతలు తీశారు. పనులు ఆగిపోవడంతో ఆ గుంతలుకాస్తా వాహనదారులకు ప్రమాదకరంగా తయారయ్యాయి.

- పనులను ప్రారంభించి దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అనే చందంగా తయారయ్యా.ఇ ఈ రహదారిపై రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారుల పరిస్థితి గుంతల కారణంగా నరక ప్రాయమవుతోంది.



ఘాంసిమియాగూడ వద్ద పూర్తి చేయని కల్వర్టు పనులు

ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు..

విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

- ఘాంసిమియాగూడ సమీపంలో ఏడాదిన్నర కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తర్వాత జరిగిన ఘటనల్లో సుమారు పది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇక గాయాలై ఆస్పత్రి పాలైన వాహనదారులు చాలా మంది ఉన్నారు.



పెద్దషాపూర్ వద్ద అసంపూర్తిగా విస్తరణ పనులు

ఆరు వరుసలుగా..

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని ఆరు వరుసలకు విస్తరించడానికి సుమారు రూ. 540 కోట్లు కేటాయించారు. ఈ పనులను 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి గడ్కరీ ప్రారంభించారు. ఆరంభంలో పనులు జోరుగా సాగినా.. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయం నుంచి పనులు నిలిచిపోయాయి. అడపాదడపా అక్కడక్కడ పనులు చేస్తూ.. కాలం సాగదీస్తున్నారు.

సత్వరమే పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి. గుంతల కారణంగా ఈ దారిలో వెళ్లాలంటే భయమేస్తుంది. మూడేళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. అధికారులు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలి.

– రమేష్, వాహనదారుడు

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మల్లారెడ్డి పేర్కొన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్లారెడ్డి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. జిల్లా కార్యదర్శి కొమురయ్య, మల్లేష్‌యాదవ్, కాడం సుధాకర్, రాచూరి రాజశేఖర్, కిరణ్, విజయ్, ఎం.నర్సింహ, పి.అశోక్, జయానంద్‌రెడ్డి, అనురాధ, జగన్, గౌరీష్, మణికంఠ, ఉమ శశికాంత్‌శర్మ, ముఖేష్, బాలకృష్ణ, విమల్‌శర్మ, గురుప్రీత్‌సింగ్, శేఖర్, రాము, సతీష్, వెంకటేష్, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీకి ఉత్తమ ర్యాంకు తీసుకురావాలి

వీసీ అల్దాస్ జానయ్య



మాట్లాడుతున్న వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: ప్రతిభ, సమర్థనీయత, అనుభవాల ఆధారంగా ఏజీ వర్సిటీకి మంచి ర్యాంకు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జనాయ్య తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల పదోన్నతులు పొందిన అధికారులు, నూతనంగా వచ్చిన అధికారులతో పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ అధికారుల నియామకాన్ని ఎటువంటి ఒత్తిళ్లు ప్రలోభాలు లేకుండా పూర్తి చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లో దేశంలోని అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పీజేటీఎఎస్‌ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సంక్షేమమే పరమావధిగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఉపకులపతి సూచనలు, సలహాలతో విశ్వవిద్యాలయ స్థాయిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పదోన్నతి పొందిన అధికారులు సూచించారు.

లక్ష్మీగూడ వాంబే కాలనీలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: శాంతిభద్రతలను కాపాడేందుకే కార్డన్ సెర్చ్‌లను చేపడుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ వాంబే కాలనీలోని వైట్, పింక్ బిల్డింగ్ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న 8 దుకాణాల నిర్వాహకుపై కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. నివాస ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



టోలిచౌకీలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ తదితర డివిజన్లలోని గోల్కొండ, నదీమ్ కాలనీల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల కోసం చేపట్టిన తవ్వకాలతో ఇబ్బందులు పడుతున్నామని త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. నదీమ్‌కాలనీకి వరద ముప్పును శాశ్వతంగా తప్పించేందుకు పనులు కొనసాగుతున్నాయని, సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం టోలిచౌకీ-టూమ్స్ రోడ్డు, టోలిచౌకీ చౌరస్తా వద్ద పైపులైన్ పనులను పరిశీలించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరలోనే బల్దియా కమిషనర్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని పేర్కొన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమం బీజేపీతోనే సాధ్యం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు టి.అంజన్‌కుమార్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ శాఖ అధ్యక్షుడు మెండే నాగేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ మంచిరేవుల కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు భిక్షపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, శివరాజ్, అరవింద్, జైదీప్, జైపాల్‌రెడ్డి, వెంకటేష్, రవియాదవ్, చెన్నయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు



ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: ఉమ్రా యాత్రకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం సాయంత్రం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన యాత్రికులు బయలుదేరారు. అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకుడు ఫయాజ్ అలీ పర్యవేక్షణలో వారంతా 15 రోజుల యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: టూమ్స్ చౌరస్తా, టోలిచౌకీ, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలను సీజ్ చేసి టోలిచౌకీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్ మాట్లాడుతూ.. టోలిచౌకీ పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో వాహనాల సంఖ్య బాగా పెరిగిందని, అక్రమ పార్కింగ్‌ల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.



వాహనాలను సీజ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు



శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సేవాసమితి సభ్యులు

శంషాబాద్: రెడ్డి కులస్తులపై తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శంషాబాద్ రెడ్డి సేవా సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. రెడ్డి కులస్తుల మనోభావాలను కించపర్చేలా తీన్మార్ మల్లన్న వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం డీసీపీ కార్యాలయం ప్రాంగణంలో వారు మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి కులాల మధ్య చిచ్చు రేపుతున్న అతడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు మునగాల సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కోశాధికారి జనార్ధన్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, సంతోష్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో...

మణికొండ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మణికొండ రెడ్డి ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు బుధవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న మాటలు, చేష్టలు రెడ్ల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. సభ్యులు నరేందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, శివారెడ్డి, బాలవెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, శరత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కిషన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృపాకర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, రామిరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సాకేత్‌రెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మణికొండ గ్రామ కమిటీ ఎన్నిక

మణికొండ: ఎమ్మార్పీఎస్ గండిపేట మండలం మణికొండ గ్రామ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డప్పు కళ్యాణ్‌మాదిగ, ప్రతినిధిగా డప్పు అభిలాష్‌మాదిగ, ఉపాధ్యక్షులుగా డప్పు అరుణ్‌మాదిగ, ప్రధాన కార్యదిర్శగా జొన్నాడ సందీప్‌మాదిగ, కార్యదర్శిగా మాదాసు లింగంమాదిగ, కోశాధికారిగా పల్లెవేల వేణుమాదిగ, ప్రచార కార్యదర్శిగా అనారాల కార్తీక్‌మాదిగ, కార్యవర్గ సభ్యులుగా యాదవల్లి రాముమాదిగ, నర్సింహామాదిగ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ గండిపేట మండల ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ మాట్లాడుతూ... వేల గొంతుల లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు డప్పు నర్సింహ మాదిగ, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఏ సభ్యుల ప్రయోజనాలను కాపాడాలి

మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కోరిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ, ఆర్‌డబ్ల్యూ సభ్యులు

గచ్చిబౌలి: రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యుల ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీస్ సైబరాబాద్-ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులతో కలిసి నగరంలోని మంత్రులు నివాస ప్రాంగణంలో మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్-2001 ప్రకారం నమోదు చేయబడిని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) చట్టపరమైన స్థితిని సమర్థించడం, వేలాది మంది ఆర్‌డబ్ల్యూలకు ప్రయోజనం చేకూర్చడం వంటి అంశాలను మంత్రికి వివరించారు. టీఎస్ఆర్ఏ-2001 కింద నమోదైన ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీలు ఈ ఫెడరేషన్‌లో సభ్యులుగా ఉన్నారని, వీరిలో దాదాపు అందరూ తమ ఆర్‌డబ్ల్యూలను టీఎస్ఆర్ఏ-2001 కింద నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాంధీ వివరించారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కావూరి అనిల్, ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులు సాయిరవిశంకర్, మాగంటి సత్యనారాయణ, హరిప్రసాద్, శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత

శంషాబాద్: రాళ్లగూడ సమీపంలోని సర్వే నంబర్: 601, 602లలో రహదారికి అడ్డంగా నిర్మాణం చేసిన ప్రహరీని బుధవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేశారు. రోడ్డు స్థలంలో ఉన్న గోడపై స్థానికులు ఫిర్యాదులు రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. తమ సొంత పట్టా భూమిలో వేసుకున్న ప్రహరీని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా కూల్చివేసినట్లు స్థానికులు ఆరోపించారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన నిందితుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టీఎన్‌జీవోస్ కాలనీలో కుక్కమల్ల ప్రకాష్‌కు ప్లాట్ నెంబర్ 517లో 300 గజాల స్థలం ఉందని ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. దీనిని గతంలో పవన్ కుమార్ అనే వ్యక్తికి జీపీఏ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అప్పుడు ఈ స్థలం ఖాళీ ప్లాట్‌గా ఉండేదన్నారు. ఈ ప్లాట్‌ను సుభాష్, అశోక్ అగర్వాల్, సంజుదేవిలు ఫోర్జరీ చేసి డాక్యుమెంట్స్‌తో అక్రమించుకొని బిల్డింగ్ కట్టి ఉంటున్నారన్నారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. 1999లో కుక్కమల్ల ప్రకాష్ చనిపోగా విషయం తెలుసుకున్న స్థానిక ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొప్పుల అమరేశ్వర్‌గౌడ్ ఈ స్థలంపై కన్నేసి 2011వ సంవత్సరంలో తనకు తెలిసిన సుభాష్, శ్రీనివాస్, సయ్యద్ రఫీద్‌ఖాన్, నర్సింహారెడ్డిలతో కుమ్మక్కై ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫొటోను పెట్టి అమరేశ్వర్‌గౌడ్ ఫోర్జరీ సంతకం చేసి సుభాష్ అనే వ్యక్తి పేరు మీద జీపీఏ చేశాడన్నారు. ఆ తరువాత ప్లాట్‌ను వీరంతా కలిసి అశోక్ అగర్వాల్‌కు అమ్మినట్లు విచారణలో తేలిందన్నారు. గత నెల 28వ తేదీన శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా అతడిని 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. బుధవారం కొప్పుల అమరేశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ నరేందర్ వివరించారు.

మూడో అంతస్తు నుంచి పడి ఉద్యోగి మృతి

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి పడటంతో ఓ ఉద్యోగి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన జయరాం(45) రాజేంద్రనగర్ అపార్డ్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. పది రోజుల క్రితం అపార్డ్ ప్రధాన భవనం నుంచి ఈటీసీ భవనానికి బదిలీ అయ్యాడు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మూడో అంతస్తు నుంచి కిందపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన తోటి ఉద్యోగి ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.